# ఎన్‌హెచ్‌ఎం నిధులు స్వాహా..!

## టెండర్లు లేకుండానే రూ.30 లక్షలు విత్‌డ్రా

**సూర్యాపేట జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో అవినీతికి అంతమే లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనల మేరకు లక్ష రూపాయల దాటి ఏదైనా కొనుగోలు చేయాలంటే ఇ-టెండర్ పిలవాలి. కానీ గత నెలలో జిల్లాలోని 122 సబ్ సెంటర్లకు మెటీరియల్ కొనుగోలు చేసే నిమిత్తం ఎలాంటి టెండర్లు లేకుండానే రూ.30 లక్షలు ఇష్టారాజ్యంగా డ్రా చేయగా, అంతకు ముందు పీహెచ్‌సీలు, సబ్ సెంటర్లలో ఫ్లెక్సీలు అతికించేందుకు రూ.4,71,420 కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి బంధువుకు అప్పగించి డబ్బులు డ్రా చేసి పెద్ద మొత్తంలో స్వాహా చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే ప్రసూతి సెలవులు తీసుకునే వారు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే ఇద్దరు ముగ్గురు కాంట్రాక్ట్ ఉద్యోగులను టార్గెట్ చేసుకొని వేతనాలు దండుకున్నారని తొలుత ఆరోపణలు రాగా ఇద్దరు ముగ్గురు కాదు 25కు పైనే మంది నుంచి రూ.40లక్షల వరకు దండుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.**

– సూర్యాపేట, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ)



ఆత్మకూర్.ఎస్ మండల పరిధిలోని ఓ సబ్‌సెంటర్‌లో అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు

తమకు అడ్డు ఎవరు చెబుతారు..? మేం చేసిందే శాసనం... మాకు తోచిందే నిబంధన... ఎవ్వరు అడ్డు చెప్పినా అంతు చూస్తాం అంటూ హూంకరింపులు... ఎవ్వరూ కిమ్మనకుండా భయపెట్టి నేనే రాజు... నేనే మంత్రి అన్న చందంగా గత రెండేండ్లుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో అవినీతి, అక్రమాలకు తెరలేపారు. ఏదీ వదలకుండా తమకు ఎంత లాభం వస్తుందనేదే ఆలోచన. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ సెంటర్లు, స్కానింగ్ సెంటర్లకు కండ్లు మూసుకొని అనుమతులు ఇచ్చిన విషయం ఇటీవల బహిర్గతమైన విషయం విదితమే. ఇలా అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఈ శాఖ గత నెలలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) నుంచి రూ.30,50,000, అలాగే ఫ్లెక్సీల ప్రింటింగ్ పేరిట రూ.4,71,420 కేంద్ర నిధులు రాగా మెజారిటీ స్వాహా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఎక్కడ చిన్న అవినీతి చోటు చేసుకున్నా స్పందించి చర్యలు తీసుకుంటున్న జిల్లా ఉన్నతాధికారులు ఈ శాఖపై వస్తున్న ఆరోపణలపై పత్రికల్లో వస్తున్నా, హైదరాబాద్ నుంచి వచ్చి విచారణ చేసి అక్రమాలు జరిగినట్లు తేల్చుతున్నా కనీసం పట్టించుకోకపోవడం ఆశ్చర్యాన్ని కల్గిస్తున్నది.

### 25మందికి పైనే..

కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్‌లో పని చేసే మహిళా ఉద్యోగులు ప్రసూతి కోసం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి పెయిడ్ సెలవులు ఉండవు. దీంతో అలాంటి వారికి భవిష్యత్తులో రెగ్యులర్ అయ్యే సమయంలో సెలవులు పెట్టినందుకు సర్వీసు నిబంధన దెబ్బతీస్తుంది. దీనిని ఆసరాగా చేసుకొని అలాంటి వారినే టార్గెట్ చేసుకొని జిల్లాలో ఇద్దరో ముగ్గురి నుంచి జీతాలు తీసుకొని సర్వీసు బ్రేక్ కాకుండా అక్రమాలకు తెరలేపినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనిపై నమస్తే తెలంగాణ దినపత్రికలో వార్తలు ప్రచురితం కాగా ఇప్పటికే ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. అది ఇద్దరు ముగ్గురికే పరిమితం కాలేదని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నాలుగు నియోజకవర్గాల పరిధిలోని ఏకంగా 25కు పైనే మంది నుంచి దాదాపు రూ.40 లక్షల వరకు దండుకున్నట్లు కార్యాలయ వర్గాల ద్వారా తెలుస్తుంది. అయితే ఓ ఉద్యోగిని రిజైన్ చేసి వెళ్లిపోగా ఆమె వేతనాన్ని ఓ కార్యాలయ ఉద్యోగి ద్వారా అధికారులు తీసుకున్నారని, మాట్లాడిన ఫోన్ కాల్ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టగా నేడు అదే ఫోన్ కాల్ రికార్డు విచారణాధికారికి ఎవిడెన్స్ కానున్నట్లు ఆ శాఖలో ప్రచారం జరుగుతున్నది. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలోనే ఐదుగురు ఉద్యోగినులు సెలవుల్లో వెళితే వేతనాలు తీసుకొని వారికి అటెండెన్స్ వేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాగా గతంలో వచ్చిన వార్తలపై పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ స్పందించి అదనపు డైరెక్టర్ డాక్టర్ ఆర్.పుష్పను విచారణ నిమిత్తం నియమించింది. ఆమె మంగళవారం జిల్లా కేంద్రంలో విచారణ చేపట్టనున్నట్లు తెలుస్తుండగా విచారణ అధికారి ఆదేశాలో లేక జిల్లా అధికారుల ఆదేశాలో తెలియదు కానీ వైద్యారోగ్యశాఖ కార్యాలయ సూపరింటెండెంట్‌తో పాటు మరో డాక్టర్ ఆయా సెంటర్లలో ఉన్న అటెండెన్స్ రిజిస్టర్లను పరిశీలించారు. అంతే కాకుండా ఆరోపణలు ఎదుర్కొంటున్న సెంటర్ల నుంచి రిజిస్టర్లను జిల్లా కార్యాలయానికి చేర్చినట్లు కార్యాలయ సిబ్బంది ద్వారా తెలిసింది.

### టెండర్ లేకుండా.. ఇష్టారాజ్యంగా..

నిబంధనల మేరకు లక్ష రూపాయలకు పైనే వెచ్చించి ఏదైనా కొనుగోలు చేయాలంటే ఇ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలవాల్సి ఉంటుంది. కానీ జిల్లాలోని 122 సబ్ సెంటర్లకు ప్రింటెండ్ రిజిస్టర్లు, డిజిటల్ ఫోమ్ బోర్డులు తదితర ఐఈసీ మెటీరియల్ కొనుగోళ్ల కోసం రూ.30,50,000, ఫ్లెక్సీ ప్రింటింగ్ కోసం రూ.4,71,420 ఖర్చు చేయడం ఆరోపణలకు తావిస్తుంది. వాస్తవానికి ఐఈసీ మెటీరియల్ కొనుగోలు చేయాలంటూ నేరుగా సబ్ సెంటర్లకే రూ.25వేలు ఇవ్వవచ్చని, కానీ కార్యాలయం నుంచి ఏకంగా భీం బ్లూటెక్ నుంచి కార్యాలయానికి అభ్యర్థన లేఖ వచ్చింది. సదరు సంస్థ పేరిట అన్ని సెంటర్ల నుంచి రూ.25వేల చెక్కులు ఇవ్వాలంటూ జిల్లా కార్యాలయం నుంచి ప్రొసీడింగ్స్ ఇచ్చారని, ఈ తతంగంలో భారీ అవినీతి జరిగిందని పేరు చెప్పడానికి నిరాకరిస్తున్న ఉద్యోగులు చెబుతున్నారు. మెటీరియల్ రాక ముందే చెల్లింపులు జరిగినట్లు తెలుస్తుండడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. ఇక ఫ్లెక్సీల ప్రింటింగ్ కోసం జిల్లా కేంద్రంలో అనేక ప్రింటింగ్ ప్రెస్‌లు ఉన్నప్పటికి ఓ అధికారి తిరుమలగిరికి చెందిన తన సమీప బంధువుకు ఎలాంటి టెండర్లు లేకుండానే కట్టబెట్టినట్లు తెలిసింది. వాస్తవానికి లక్ష దాటి ఏదైనా చేయాలంటే వైద్య ఆరోగ్యశాఖ నుంచే ఇ–ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు పిలవాలి లేదా డిస్ట్రిక్ట్ పర్చేజ్ కమిటీ ఆధ్వర్యంలోనైనా టెండర్లు పిలవాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా ఎవ్వరి అనుమతులు తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## బీఆర్‌ఎస్ మండల శ్రేణులకు ధన్యవాదాలు

- మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి

కోదాడ రూరల్, ఏప్రిల్ 28 : బీఆర్‌ఎస్ పార్టీ ప్రతిష్ఠాత్మకంగా వరంగల్‌లో నిర్వహించిన 25 ఏండ్ల రజతోత్సవ మహాసభకు మండలం నుంచి స్వచ్ఛందంగా తరలి వచ్చి విజయవంతం చేసినందుకు గానూ పార్టీ శ్రేణులకు సోమవారం కోదాడ మాజీ ఎంపీపీ చింతా కవితారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. మండల పరిధిలోని గుడిబండలో గల ఆమె నివాసంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. కేసీఆర్ అందించిన స్ఫూర్తితో గ్రామాల్లో కార్యకర్తలు కాంగ్రెస్ నాయకుల అవినీతి, చేతగాని తనాన్ని ఎండగట్టేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపినిచ్చారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ కవితారెడ్డి

## టీబీ రోగులకు పోషకాహార కిట్లు పంపిణీ

హుజూర్‌నగర్ రూరల్, ఏప్రిల్ 28 : టీబీ వ్యాధిగ్రస్తుల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు న్యూట్రిషన్ కిట్లు ఉపయోగపడుతాయని వైద్యాధికారి డాక్టర్ యశ్వంత్‌కుమార్ అన్నారు. లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణలో ప్రభుత్వం అందించిన న్యూట్రిషన్ కిట్లను 34మంది వ్యాధి గ్రస్తులకు సోమవారం ఆయన అందించి మాట్లాడారు. పోషకాహారలోపం వల్ల టీబీ వ్యాప్తి పెరిగి ప్రమాదకర స్థితిలో మరణాలు సంభవిస్తాయని, వ్యాధిగ్రస్తులు పోషకాహారం, మందులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల వ్యాధిని సులభంగా తగ్గించుకోవచ్చన్నారు. గ్రామాల్లో చేపట్టే టీబీ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, పీహెచ్‌ఎన్‌ఓ నూర్జహాన్‌భేగం, సూపర్‌వైజర్ పద్మ, ఇందిరాల రామకృష్ణ, ఉదయగిరి శ్రీనివాస్, రమేశ్, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



న్యూట్రిషన్ కిట్లు అందిస్తున్న వైద్యాధికారి యశ్వంత్‌కుమార్

## పోలీస్ సిబ్బందికి వాటర్ బాటిళ్ల పంపిణీ

నేరేడుచర్ల, ఏప్రిల్ 28 : పట్టణ పోలీస్ స్టేషన్ సిబ్బందికి వాసవి, వనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో సోమవారం స్థానిక గవర్నర్ రాచకొండ విజయలక్ష్మి చలువ కళ్లజోళ్లు, స్థానిక శ్రీ సాయి స్టీల్ అండ్ జనరల్ స్టోర్స్ యజమాని ఐత శంభు లింగం సహకారంతో వాటర్ బాటిళ్లను అందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రవీందర్, వనితా క్లబ్ సభ్యులు గరిణె అరుణకుమారి, పవిత్రం శ్రీనివాస్, రేణిగుంట్ల శ్రీనివాస్, ఉప్పల విద్యాసాగర్, రాచకొండ శ్రీనివాస్‌రావు, వీరవల్లి శ్రీలత, గెల్లి లక్ష్మీనర్సింహారావు, ఐత సముంత్, గరిణె జ్యోతి, నటరాజ్, అశోక్, సిబ్బంది ఉన్నారు.



పోలీసులకు గ్లాసెస్, వాటర్ బాటిళ్లు అందిస్తున్న క్లబ్ సభ్యులు

## ప్రజావాణి దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు

సూర్యాపేట, ఏప్రిల్ 28 : ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 80 మంది సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందించగా వాటిని ఆయా శాఖల అధికారులకు అందించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అత్యధికంగా భూ సమస్యల పరిష్కారం, సొంత ఇంటి కోసం దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు. ఆయా శాఖల అధికారులు వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, ఎన్నికల సూపరిండెంట్ శ్రీనివాస రాజు, డీఎస్‌ఓ రాజేశ్వర్‌రావు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, డీడబ్ల్యూఓ నరసింహారావు పాల్గొన్నారు.



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

## పాత నేరస్తులకు కౌన్సిలింగ్


హుజూర్‌నగర్, ఏప్రిల్ 28 : మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో పాత నేరస్తులకు పోలీస్ భరోసా కార్యక్రమంలో భాగంగా సోమవారం సీఐ చరమందరాజు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దని, మంచి ప్రవర్తనతో మెలుగాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ముత్తయ్య, లక్ష్మీ నర్సయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



పాత నేరగాళ్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ చరమందరాజు

## అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలి : సీపీఎం

అర్వపల్లి, ఏప్రిల్ 28 : అర్హులకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలని సీపీఎం నాయకులు సోమవారం ఎంపీడీఓ గోపికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల పరిధిలోని రామన్నగూడెంలో పేదలకు, వితంతువులకు కాకుండా అధికార పార్టీ నాయకులు తమ ఇష్టానుసారంగా తమ అనుచరులకు, భూములున్న వారిని ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రజా పాలన అని చెప్పుకుంటున్న ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి గ్రామ సభ నిర్వహించి రీ సర్వే చేసి అర్హులను గుర్తించి ఇండ్లను ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, కార్యదర్శి కృష్ణయ్య, వెంకన్న, సైదులు, సాయికుమార్ పాల్గొన్నారు.



ఎంపీడీఓ గోపికి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

## ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

మఠంపల్లి, ఏప్రిల్ 28 : మండలంలోని మంచ్యాతండాలో ఇటీవల ఉపాధి హామీ పనుల్లో ఎంజీఎన్‌ఆర్ ఈజీఎస్ పథకం కింద జరిగిన పనుల్లో భాగంగా మస్టర్లు ఫోర్జరీ చేసి పనుల్లో అవకతవకలకు పాల్పడ్డారని స్థానికులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో స్థానిక ఎంపీడీఓ మంచ్యాతండాలో విచారణ చేసి కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. దీంతో కలెక్టర్ మంచ్యాతండా ఫీల్డ్ అసిస్టెంట్ మాళోతు రవిని విధుల నుంచి సస్పెండ్ చేసి ఏపీఓ ఉమ, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహకు షోకాజు నోటీసులు అందించినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

## మే 10 వరకు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి : ఏఓ

నేరేడుచర్ల, ఏప్రిల్ 28 : రైతు బీమా పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తున్నందున అర్హులైన రైతులు మే 10 వరకు స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఓ జావిద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతు బీమా దరఖాస్తు, పట్టాపాస్ బుక్ జిరాక్స్, ఆధార్ కార్డు జిరాక్స్, నామిని ఆధార్ కార్డు జిరాక్స్‌ను ఇవ్వాలని కోరారు. 18–59 ఏండ్ల లోపు రైతులు బీమాకు అర్హులని, పరిశీలన ప్రక్రియ ఇది వరకు నమోదు చేసుకున్న రైతులకు మాత్రమేనని చెప్పారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ప్రజలకు అందుబాటులో ఉండాలి : ఎంపీడీఓ

నూతనకల్, ఏప్రిల్ 28 : గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ సునీత అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ప్రకృతి వనాలు, నర్సరీలు, క్రీడా ప్రాంగణాలు, డంపింగ్ యార్డులు, శ్మశాన వాటికల్లో నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. వన నర్సరీలో నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు ట్యాంకర్ డ్రైవర్లను ఒక రోజు చెత్త సేకరణకు, మరో రోజు నీళ్ల ట్యాంకర్‌కు పంపాలని సూచించారు. వీధులు, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పంచాయతీ రికార్డులు ఆప్‌డేట్ చేయాలని ఆదేశించారు.

## గడ్డివాములు ధ్గం

గరిడేపల్లి, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలో సోమవారం 4 గడ్డివాములు దగ్ధమయ్యాయి. ఉదయం విపరీతమైన గాలి వీస్తుండడంతో విద్యుత్ వైర్లు ఒకదాన్ని ఒకటి తాకి నిప్పు రాలడంతో పక్క పక్కనే ఉన్న 4 గడ్డివాములు దగ్ధమయ్యాయి. గ్రామస్తులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో కొప్పు లచ్చయ్య, కొప్పు సైదులు, కొప్పు బాలకృష్ణకు చెందిన సుమారు 15ట్రాక్టర్ల గడ్డివాము దగ్ధమయ్యాయి. సుమారు రూ.1లక్ష ఆస్తినష్టం జరిగినట్లు బాధితులు పేర్కొన్నారు.

## పెండింగ్ ఎక్స్‌గ్రేషియాను విడుదల చేయాలి : ప్రభాకర్‌గౌడ్

నూతనకల్, ఏప్రిల్ 28 : పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటి సభ్యుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రూ.4.13కోట్ల ఎక్స్‌గ్రేషియా పెండింగ్‌లో ఉందన్నారు. నూతనకల్ మండలంలో నీరా ప్రాజెక్టు ఏర్పాటు చేసి కల్లు గీత కార్మికులను ఆదుకోవాలని కోరారు. గీత కార్మికలకు సబ్సిడీ కింద ప్రభుత్వం మోటార్ సైకిళ్లను అందించాలని కోరారు. కొల్లు శేఖర్, వెంకన్న, మల్లయ్య, మల్లయ్య, మల్లయ్య, సూరయ్య, ఉప్పలయ్య ఉన్నారు.

## ఉచిత పశు వైద్య శిబిరం

కోదాడ రూరల్, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని అడ్లూరు గ్రామంలో సోమవారం కోదాడ పట్టణానికి చెందిన సంఘం డెయిరీ యాజమాన్యం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 100 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించారు. జోనల్ హెడ్ మాట్లాడుతూ తమ సంఘం తరపున పశువులకు బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యులు యశ్వంతరావు, ప్రదీప్, ఉమామహేశ్వర్‌రావు, కోదాడ ప్లాంట్ మేనేజర్ డి.వరప్రసాద్, సుపర్‌వైజర్ రమేశ్, రామకృష్ణ, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## 'మై హోం' ఉద్యోగులకు బహుమతులు

మేళ్లచెర్వు, ఏప్రిల్ 28 : జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన పలు పోటీల్లో స్థానిక మైహోం పరిశ్రమ ఉద్యోగులు పలు బహుమతులు గెలుచుకున్నట్లు ప్లాంట్ హెడ్ శ్రీనివాస్‌రావు సోమవారం తెలిపారు. తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్‌రాజ్ చేతులమీదుగా బహుమతులు అందుకున్న ఉద్యోగులు ఎం.ప్రకాశ్, జి.నాగరాజు, వి.ఓంకార్, వై.నాగేశ్వర్‌రావుకు అభినందనలు తెలిపారు.



హుజూర్‌నగర్ : అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

## సందేహాలను నివృత్తి చేయడానికి సదస్సులు

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

హుజూర్‌నగర్, ఏప్రిల్ 28 : రైతుల శాశ్వత భూ సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని స్వర్ణ వేదిక ఫంక్షన్ హాల్‌లో సోమవారం రైతులకు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టంపై రైతులకు ఉన్న సందేహాలను నివృత్తి చేయడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతకు ముందు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఒక్కో అంశాన్ని ఆర్డీఓ శ్రీనివాసులు రైతులకు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రాధిక దేశ్‌ముఖ్, డీసీసీబీ డైరెక్టరు వెంకటేశ్వర్లు, డీఏఓ రాజేందర్‌రెడ్డి, ఏడీఏ రవి, ఇన్‌చార్జి తాసీల్దార్ నాగేందర్, ఎంపీడీఓ లావణ్య పాల్గొన్నారు.

చిలుకూరు : భూ భారతి చట్టం రైతులకు వరమని కలెక్టర్ అన్నారు. చిలుకూరులో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యనారాయణ, తాసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఏఓ శ్రీధర్, డీటీ కరుణశ్రీ, చిలుకూరు పీఏసీఎస్ చైర్మన్ అల్సకాని జనార్దన్, ఆర్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి


## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి
- కిష్టాపురంలో కార్డన్ సెర్చ్

చింతలపాలెం, ఏప్రిల్ 20 : సోషల్ మీడియా ఎంత వేగంగా విస్తరిస్తుందో అంతే వేగంగా యువత సైబర్ నేరాల ఉచ్చులో పడుతున్నారని చదువుపై దృష్టి సారించకుండా భవిష్యత్ నాశనం చేసుకుంటున్నారని కోదాడ రూరల్ సీఐ రజితా రెడ్డి అన్నారు. ఎస్పీ నరసింహ ఆదేశాల మేరకు మండలంలోని కిష్టాపురం గ్రామంలో ప్రజలు, యువతకు సైబర్ నేరాలపై, మత్తు మందు, డ్రగ్స్‌పై, పోలీసు కళా బృందంతో ఇన్‌చార్జి ఎస్‌ఐ పరమేశ్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరి చేతిలో ఆండ్రాయిడ్ ఫోన్లు వచ్చాయని, ఇప్పుడు ప్రస్తుత సమాజంలో సోషల్ మీడియా ప్రభావం ఎక్కువగా ఉందన్నారు. యువత మత్తుకు బానిసలు కావొద్దని, బాగా చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. గ్రామంలో ఎలాంటి ఘర్షణలు లేకుండా అందరూ కలిసి మెలిసి ఐకమత్యంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు కమ్యూనిటీ పోలీస్ బృందం ఆధ్వర్యంలో గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. 210 ఇండ్లలో తనిఖీలు నిర్వహించి, నంబర్ ప్లేట్ లేని 14 ద్విచక్ర వాహనాలు, సరైన పత్రాలు లేని 44 బైక్‌లు, ఒక ఆటోను గుర్తించి సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు అనిల్ కుమార్ రెడ్డి, నవీన్ కుమార్, పోలీస్ సిబ్బంది, కళాబృందం ఎల్లయ్య, గురులింగం, గోపయ్య, నాగార్జున, కృష్ణ, గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 28 : జిల్లా కేంద్రంలోని సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. కోదాడ మండలం తొగర్రాయి గ్రామానికి చెందిన లిక్కి రామారావు(46) బైక్‌పై సీఎంఆర్ షాపింగ్‌మాల్ అండర్‌పాస్ నుంచి కొత్త బస్టాండ్ వైపునకు వెళ్తుండగా కారు అతి వేగంగా వచ్చి ఎదురుగా ఢీ కొట్టింది. ఘటనలో రామారావు తలకు గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. రామారావుకు ముగ్గురు పిల్లలు కాగా దురాజ్‌పల్లిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు.




తిరుమలగిరి జడ్పీ పాఠశాల ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ప్రదర్శన

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

తిరుమలగిరి, ఏప్రిల్ 28 : మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని కోరారు.

కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



హద్దులు నిర్ణయిస్తున్న అధికారులు

## నాగారం ఇసుక రీచ్‌లో విచారణ

నాగారం, ఏప్రిల్ 28 : మండల పరిధిలోని వర్ధమానుకోట రెవెన్యూ శివారు, జాజిరెడ్డిగూడెం రెవెన్యూ శివారు ఇసుక రీచ్‌ల హద్దులను ఇరు గ్రామాల ప్రజల సమక్షంలో సోమవారం విచారణ చేశారు. సూర్యాపేట, నాగారం, జాజిరెడ్డిగూడెం సర్వేయర్లు, గిర్దావర్ల ఆధ్వర్యంలో హద్దులను నిర్ణయించి రాళ్లు పాతించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు అందించనున్నట్లు తాసీల్దార్ బ్రహ్మయ్య తెలిపారు.

## ఆదివాసీలపై దమనకాండ హక్కుల ఉల్లంఘనే : హస్సేన్


సూర్యాపేటటౌన్, ఏప్రిల్ 28 : ఆదివాసీలను నక్సలైట్ల పేరుతో కేంద్ర ప్రభుత్వం మిలటరీ బలగాలను ఉపయోగించి దమనకాండ నిర్వహించడం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనే అని పూర్వ ప్రభుత్వ సహాయ న్యాయవాది, మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. అటవీ సంపదను కాపాడాలని అడవులను సంరక్షించాలని బడా పారిశ్రామికవేత్తల వ్యాపారం, మైనింగ్ కోసం కొన్నేండ్లుగా కేంద్ర ప్రభుత్వం అటవీ ప్రాంతాలను విక్రయిస్తుందని విమర్శించారు. ఇప్పటికే దేశంలో జనాభా నిష్పత్తి ప్రకారం అడవుల శాతం లేదని, రక్షించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని చెప్పారు.



తళ్లమల హస్సేన్

## అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న బక్కి వెంకటయ్య

సిటీబ్యూరో, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల మరియు షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ఆధ్వర్యంలో సోమవారం ఎస్సీ, ఎస్టీ నేరాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. షెడ్యూల్ కులాలపై దాడులు, వివక్షకు సంబంధించిన కేసుల పరిణామాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ.. రాచకొండ కమిషనరేట్ పరిధిలో ఎస్సీ, ఎస్టీ (అట్రాసిటీ) కేసులను త్వరగా విచారించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ.. తమ కమిషనరేట్ పరిధిలో న్యాయ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం లేకుండా, బాధితులకు న్యాయం జరిగేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు కుస్రం నీలాదేవి, కొంకటి లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, డీసీపీలు.. పద్మజ, ప్రవీణ్ కుమార్, అక్షంష్ యాదవ్, అరవింద్ బాబు, ఇందిర, జీ నర్సింహారెడ్డి, డీసీపీ సునీతారెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజేందరరెడ్డి పాల్గొన్నారు.

## మేడేను విజయవంతం చేయాలి : సీపీఎం

తుంగతుర్తి, ఏప్రిల్ 28 : మేడేను వాడవాడలా ఉత్సాహంగా జరుపాలని సీపీఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని వీఎన్ భవనంలో సోమవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, నాగారం మండల కన్వీనర్ దేవరకొండ యాదగిరి, మండల కమిటీ సభ్యులు గడ్డం ఎల్లయ్య, జాజిగాల ముత్తయ్య, బోనాల వెంకన్న, సోమయ్య, యాదగిరి పాల్గొన్నారు.